www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 21 ఫిబ్రవరి 2025
5
చిత్తూరు



కారుణ్య నియామకం



నియామక ఉద్యోగ పత్రాన్ని అందిస్తున్న జిల్లా ఎస్పీ

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్
2014 జూన్ 5వ తేదీ విధి నిర్వహణలో అనారోగ్యంతో మరణించిన కానిస్టేబుల్ వేలు సతీమణి గాయత్రికి జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు కారుణ్య నియామకం కింద గురువారం ఎస్పీ కార్యాలయంలో నియామక పత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో కర్నూల్ రేంజ్ హోంగార్డు కమాండెంట్ మహేష్, తిరుపతి హోంగార్డు డీఎస్పీ చిరంజీవి, హోంగార్డ్ ఆర్ఐ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

సామాన్యులపై భారం మోపిన

కేంద్ర బడ్జెట్‌ను వ్యతిరేకించండి

- **సిపిఎం -సిపిఐ నిరసన**



గాంధీ విగ్రహం ఎదుట నిరసన తెలుపుతున్న వామపక్ష నాయకులు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: సామాన్యులపై భారం మోపిన కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ దేశవ్యాప్తంగా వామపక్షాల ఆధ్వర్యంలో ప్రజల్లో ప్రచారం చేయడం జరుగుతోందని, గురువారం చిత్తూరు గాంధీ విగ్రహం వద్ద సిపిఎం సిపిఐల ఆధ్వర్యంలో నిరసన తెలిపినట్లు వామపక్ష నాయకులు తెలిపారు. ఈసందర్భంగా సిపిఎం జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు, సిపిఐ జిల్లా కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ ప్రజల్లో కొనుగోలు శక్తి కుచించుకుపోయినందున ఆర్థిక వ్యవస్థలో తగ్గిన డిమాండ్ సమస్యను పరిష్కరించడానికి బదులు అందుకు విరుద్ధంగా మోడీ ప్రభుత్వం సంపన్నులకు రాయితీలు ఇవ్వడం, ఖర్చుల్లో కోత పెట్టడం దారుణమన్నారు. నిరుద్యోగ సమస్యను ఈ బడ్జెట్ పూర్తిగా విస్మరించిందని విమర్శించారు. ఆహార సబ్సిడీలు, వ్యవసాయం, విద్య, ఆరోగ్యం, గ్రామీణాభివృద్ధి, సామాజిక సంక్షేమంపై పెట్టిన ఖర్చు గత ఏడాదికంటే బాగా తగ్గిపోయిందని, అవసరం ఉన్నప్పటికీ ఉపాధి హామీ పథకానికి నిధులు అదనంగా కేటాయించలేదని అన్నారు. ధరల పెరుగుదల, జీఎస్టీ పెంపుదలతో అనేక ఇబ్బందులు పడుతున్న కార్మికవర్గాన్ని ఈ బడ్జెట్ విస్మరించిందన్నారు. ఈ ప్రజా వ్యతిరేక బడ్జెట్ వ్యతిరేకిస్తూ ప్రత్యామ్నాయ ప్రతిపాదనలను ప్రజల్లోకి తీసుకెళ్ళాలని వామపక్ష పార్టీలు నిర్ణయించాయని తెలిపారు.

వ్యవసాయ ఉత్పత్తులకు కనీస మద్దతు ధరకు చట్టబద్ధమైన హామీ కల్పించాలి. వ్యవసాయ మార్కెటింగ్‌పై జాతీయ విధాన ముసాయిదాను ఉపసంహరించాలి. నేషనల్ మానిటైజేషన్ పైప్‌లైన్ ద్వారా చేపట్టే ప్రభుత్వరంగ ప్రైవేటీకరణ చర్యలను, ప్రభుత్వ ఆస్తులను ప్రైవేటు రంగానికి బదలాయించడాన్ని ఆపాలి. బీమా రంగంలో వంద శాతం ఎఫ్‌డిఐలను ఉపసంహరించాలి. మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టానికి కేటాయింపులను 50శాతం పెంచాలి. పట్టణ ఉపాధి హామీ చట్టాన్ని కూడా ప్రవేశపెట్టాలి. వృద్ధాప్యపు పెన్షన్లు, ఇతర సామాజిక భద్రతా ప్రయోజనాల కోసం కేంద్ర కేటాయింపులు పెంచాలి. ఆరోగ్య రంగ కేటాయింపులను జిడిపిలో 3శాతానికి పెంచాలి. విద్యారంగానికి జిడిపిలో ఆరు శాతానికి కేటాయింపులు పెంచాలి.

ప్రజాపంపిణీ వ్యవస్థను బలోపేతం చేయడానికి ఆహార సబ్సిడీని పెంచాలి. ఎస్సి, ఎస్టీ రంగాలకు, మహిళా, శిశు సంక్షేమానికి కేటాయింపులను గణనీయంగా పెంచాలి. వీటిల్లో ఐసిడిఎస్‌కు కూడా కేటాయింపులు పెరగాలి. అలాగే స్కీమ్ వర్కర్లకు ఇచ్చే గౌరవ వేతనాల్లో కేంద్రం వాటాను పెంచాలి. రాష్ట్రాలకు నిధుల బదిలీని పెంచాలి. అలాగే కేంద్ర ప్రాయోజిత పథకాలకు కూడా నిధులను గణనీయంగా పెంచాలి. రాష్ట్రాలతో పంచుకునే విభాగంలో చేర్చని పెట్రోలియం ఉత్పత్తులపై సెస్సులను, సర్‌చార్జీలను రద్దు చేయాలి. కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు కె.సురేంద్రన్, ఓబుల్ రాజు, చిట్టేమ్మ, సుబ్రహ్మణ్యం, ప్రసాద్, వినోద్, బాలసుబ్రమణ్యం, సిపిఐ నాయకులు గోపీనాథ్, దాసరి చంద్ర, రమాదేవి, విజయ గౌరీ, మణి, కుమారి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై అవగాహన పెంచండి

20 సూత్రాల కార్యక్రమాల అమలు ఛైర్మన్ లంక దినకర్



సమావేశంలో మాట్లాడుతున్న 20 సూత్రాల కార్యక్రమాల అమలు ఛైర్మన్ లంక దినకర్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: వికసిత్ భారత్-2047, స్వర్ణాంధ్ర లక్ష్యంగా ముందుకు సాగుదామని 20 సూత్రాల కార్యక్రమాల అమలు ఛైర్మన్ లంకా దినకర్ పేర్కొన్నారు. గురువారం జిల్లా సచివాలయంలోని సమావేశపు మందిరంలో ఇరవై సూత్రాల కార్యక్రమాల అమలు ఛైర్మన్ జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, చిత్తూరు, పూతలపట్టు శాసనసభ్యులు గురజాల జగన్మోహన్, కె.మురళి మోహన్, నగర మేయర్ అముద, డీఆర్‌వో మోహన్ కుమార్‌లతో కేంద్ర ప్రభుత్వ ప్రాయోజత పథకాలు, ప్రాజెక్టుల అమలు పురోగతి మౌలిక సదుపాయాలకు సంబంధించిన అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఛైర్మన్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న వివిద పథకాలపై ఇది వరకే 13 జిల్లాలలో సమీక్షా సమావేశాలు నిర్వహించడం జరిగిందని, చిత్తూరు జిల్లాలో 14వ సమీక్షా సమావేశం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ పథకాలపై లబ్ధిదారులకు అవగాహన కల్పించడం మన లక్ష్యమన్నారు. ప్రతి శాఖాపరంగా అమలు చేసే సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకొని వెళ్లడంలో సంబంధిత అధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని మరింత భాధ్యతతో పనిచేయాలని సూచించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జిల్లాలోని కుప్పం నియోజకవర్గంలో విజన్ -2047, స్వర్ణకుప్పం-2029 కార్యక్రమాల్ని ప్రారంభించడం జరిగిందన్నారు. జిల్లాలో ఉపాధి హామీ పథకం కింద రూ.150 కోట్లు ఖర్చు చేయడం జరిగిందని, సిసి రోడ్లు అనిమల్ షెడ్లు తదితర పనులు మంజూరు చేసి 80శాతం పనులు పూర్తి చేయడం జరిగిందని తెలిపారు. అలాగే రాష్ట్ర సరిహద్దుల్లోని, ఇండస్ట్రియల్‌కు సంబంధించిన మరమ్మతులకు గురైన రోడ్లను త్వరలో పూర్తి చేస్తామన్నారు. జిల్లాలో ఇదివరకే ముందస్తుగా 10 నుంచి 15కోట్లు లోన్ ప్రపోజల్ తీసుకున్నామని తెలిపారు. తాగునీటి సమస్యల పరిష్కారానికి ప్రతి నియోజకవర్గానికి సంవత్సరానికి ప్రత్యేకనిధి కింద కోటి రూపాయల మంజూరుకు ఛైర్మన్‌కు ప్రతిపాదించారు. దీనితో పాటూ ఓహెచ్ఆర్ ట్యాంకుల మరమ్మతులకు నిధుల కేటాయింపునకు, జిల్లాలో మ్యాంగో బోర్డు ఏర్పాటుకు, సెరికాల్చర్ కింద సెంటర్ ఆఫ్ ఎక్సలఎన్సీ ఏర్పాటు, చిత్తూరు, కుప్పంలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు, డిజిటల్ సైన్స్ రీసెర్చ్ సెంటర్ ఏర్పాటు, జిల్లాలో పర్యాటక రంగం అభివృద్ధిలో భాగంగా దేవాలయాల అనుసంధానంలో భాగంగా అవసరమైన ప్రతిపాదనలను సిద్ధం చేయడం జరిగిందన్నారు. ఇందులో మొదటగా కాణిపాకం అభివృద్ధిపై ఎక్కువ దృష్టి పెట్టమని తెలిపారు. జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన భూముల కేటాయింపునకు చర్యలు జరుగుతున్నదన్నారు. ప్రతి నియోజకవర్గంలో ఎంఎస్ఎంఈ పార్క్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పిఎం విశ్వకర్మ పథకం కింద చేతి వృత్తిదారులకు పరికరాల పంపిణీ ఆలస్యమవుతున్నందున ఈ అంశాన్ని పరిశీలించాలని కోరారు. సమావేశంలో సిపిఓ సాంబ శివారెడ్డి, డ్వామా పీడీ రవికుమార్, పిఆర్ ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈలు చంద్రశేఖర్‌రెడ్డి, విజయ్‌కుమార్, వ్యవసాయ, ఉద్యానవన, పశు సంవర్ధక శాఖల అధికారులు మురళీకృష్ణ, మధుసూదన్ రెడ్డి, డాక్టర్ ప్రభాకర్, డిపిఓ సుధాకర్ రావు, ట్రాన్స్కో ఎస్ఈ ఇస్మాయిల్, డిఆర్‌డిఏ పీడీ శ్రీదేవి, డిఎస్ఓ శంకరన్, హౌసింగ్ పీడీ గోపాల్ నాయక్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షల నిషేధచట్టం

పకడ్బందీగా అమలు చేయండి: కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షల నిషేధ చట్టం1994ను జిల్లాలో పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ వైద్య ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా సచివాలయంలోని సమావేశపు మందిరంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సుధారాణి, డిసిహెచ్ఎస్ డాక్టర్ ప్రభావతితో కలసి ఆడపిల్లల ప్రాముఖ్యతలో పిసిపిఎన్‌డిటి చట్టం ఆవశ్యకత, మెడికో లీగల్, లైంగిక వేధింపులపై సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వైద్యాధికారులు, ప్రైవేటు ఆసుపత్రుల యాజమాన్యం, పిసిపిఎన్‌డిటి కమిటీ, ఎన్జీవోలు సభ్యులు పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో ప్రతి 1000 మంది మగ శిశువులకు 954 మంది ఆడ శిశువులు ఉన్నారని, ఆడ పిల్లలను కాపాడుకోవలసిన భాద్యత మనందరి మీద ఉందని అన్నారు. ఇందుకు జిల్లాలో పిసిపిఎన్‌డిటి చట్టమును పటిష్టంగా అమలు చేయుట కొరకు న్యాయ శాఖ, పోలీసు శాఖ, స్త్రీ శిశు సంక్షేమ శాఖ, వైద్య ఆరోగ్యశాఖ సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. చట్టవిరుద్ధమైన కార్యకలాపాలైన లింగ నిర్ధారణ పరీక్షలు, భ్రూణహత్యలకు పాల్పడిన వారు చట్టపరమైన, న్యాయపరమైన శిక్షలు అమలు చేయాలని ఆదేశించారు. వైద్యఆరోగ్య శాఖ, పోలీసు, విజిలెన్స్ శాఖల వారు ప్రతినిత్యం గర్భస్థ పిండ లింగ నిర్ధారణకు పాల్పడుచున్న వారిపై నిఘా ఉంచాలన్నారు. క్షేత్రస్థాయిలో పిసిపిఎన్‌డిటి చట్టంపై అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టి ప్రజలకు చట్టంలోని శిక్షలు, జరిమానాల గురించి అవగాహన కల్పించాలన్నారు. ఈ చట్టంను కచ్చితంగా అమలు చేసి జిల్లాలో లింగ నిష్పత్తిని సమాన స్థాయికి తీసుకొచ్చేలా అధికారులు కృషి చేయాలన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా స్థాయి బృందాల ద్వారా, డివిజినల్ స్థాయి బృందాల ద్వారా నెలకు 20 తనిఖీలు, 20 డెకాయి ఆపరేషన్లు తప్పక చేయాలన్నారు. జిల్లాలో ప్రభుత్వచ ప్రైవేటు అల్ట్రాసౌండ్ స్కానింగ్ కేంద్రాలు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి వారి వద్ద తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకొని ఉండాలన్నారు. ఎవరైన అనుమతులు లేకుండా స్కానింగ్ కేంద్రాలు నడిపితే అటువంటి స్కానింగ్ గుర్తించి చర్యలు చేపట్టాలన్నారు.

పోలీస్ సేవలో హోంగార్డులు కీలకం

ప్రజాశక్తి చిత్తూరు అర్బన్ : చిత్తూరు ఆర్మ్డ్ రిజర్వు ఆఫీస్‌లో గురువారం హోంగార్డుల నుండి గౌరవ వందనం స్వీకరించి దర్బార్ పెరేడ్ నిర్వహించారు. ఈ సందర్భంగా కర్నూలు రేంజ్ హోంగార్డు కమాండెంట్ మహేష్ కుమార్ మాట్లాడుతూ ఆక్సిస్ బ్యాంకు వారి ప్రయోజనాల గురించి, ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను వివరించారు. మెడికల్ క్యాంపు నిర్వహణలో అందరు భాగస్వాములై పాల్గొనాలని సూచించారు. జిల్లాలో శాంతి భద్రతల కోసం 362 మంది హోంగార్డ్స్ విధులను నిర్వహిస్తున్నారు. వీరితో పాటు 137 హోంగార్డ్స్ వివిధ విభాగాలలో డెప్యుటేషన్ మీద పని చేస్తున్నారని తెలిపారు. హోంగార్డ్స్ పోలీసు వారితో సమానంగా ట్రాఫిక్ రెగ్యులేషన్, శాంతి భద్రతల పరిరక్షణలో నేరాలను అరికట్టడంలో పోలీసులకు వెన్నుదన్నుగా ఉంటున్నారని అన్నారు. హోంగార్డ్స్ రాష్ట్రంలో ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు, పండుగలు, విఐపి, వివిఐపి పర్యటనలకు వచ్చే సందర్భాల్లో పోలీసులకు వారి సేవలు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని, ఇదేవిధంగా హోంగార్డ్స్ తమ సేవల్ని చిత్తశుద్ధితో నిర్వహించి చిత్తూరు జిల్లా పోలీసు శాఖకి మంచి పేరు తేవాలని ఆశిస్తున్నానని తెలిపారు. ఈ పరేడ్‌కు తిరుపతి హోంగార్డు డీఎస్పీ చిరంజీవి, ఆర్ఐ హోంగార్డ్స్ చంద్రశేఖర్, ఆర్ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.



హోంగార్డుల స్థితిగతులను తెలుసుకుంటున్న కమాండెంట్ మహేష్ కుమార్

చిత్తూరులో అందుబాటులోకి ఏబీసీ కేంద్రం

వీధి కుక్కల జనాభా నియంత్రణకు పటిష్ట చర్యలు
జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్



ఏబిసి కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: వీధి కుక్కల జనాభా నియంత్రణ కోసం చిత్తూరు నగరపాలక సంస్థ వాహనాల షెడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన 'అనిమల్ బర్త్ కంట్రోల్' కేంద్రాన్ని (ఏబీసీ) గురువారం జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్, మేయర్ ఎస్.అముద, చుడా ఛైర్‌పర్సన్ కఠారి హేమలత, డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్ రెడ్డితో కలిసి ప్రారంభించారు. జిల్లా కలెక్టర్ ప్రత్యేక నిధులు రూ.15లక్షలతో వీధి కుక్కలకు కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు, వ్యాక్సినేషన్ చేయడానికి అవసరమైన సౌకర్యాలను ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చిత్తూరు నగరపాలక పరిధిలో సుమారు 7 నుంచి 8 వేల వీధికుక్కలు ఉన్నట్టు అంచనా ఉందని, వీటి జనాభాను నియంత్రించకుంటే భవిష్యత్తులో మరింత ప్రమాదకరంగా మారే అవకాశం ఉన్నందున నగరపాలక పరిధిలో రూ.15 లక్షల వ్యయంతో ఏబీసీ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు వివరించారు. గతంలో వీధి కుక్కలకు స్టెరిలైజేషన్ చేయాల్సిన సందర్భంలో తిరుపతిలోని ప్రైవేట్ వైద్యులు, ఎన్జీవోల మీద ఆధారపడాల్సి వచ్చేదని తెలిపారు. ఈ కార్యక్రమం అమలులో జాప్యం జరుగుతున్నందున చిత్తూరులోనే మొదటిసారిగా ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రాబోయే రెండు ఏళ్లలో సుమారు 5 నుంచి 6 వేల కుక్కలకు ఈ కేంద్రంలో కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు, వాక్సినేషన్ వంటి కార్యక్రమాలు చేపట్టడం ద్వారా వీధి కుక్కల జనాభాను నియంత్రించవచు అని అన్నారు. ఆపరేషన్లు నిర్వహించడంపై జిల్లాలోని పశు వైద్యులు పది మందికి రాష్ట్రస్థాయి మాస్టర్ ట్రైనీలచే శిక్షణ ఇచ్చే కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు చెప్పారు. సుప్రీం కోర్టు మార్గదర్శకాల ప్రకారం ప్రక్రియలు చేపడుతున్నట్లు కలెక్టర్ వివరించారు. ఆపరేషన్ల నిర్వహణకు సంబంధించి మొత్తం డేటాను ఆన్లైన్ ద్వారా నిర్వహించాలని, పశుసంవర్ధక శాఖ అధికారులు, నగరపాలక సంస్థ అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రక్రియను విజయవంతంగా చేపట్టాలన్నారు. చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ మాట్లాడుతూ ప్రజలకు ఎంతో ముఖ్యమైన ఇలాంటి మంచి పనులు చేయడంలో కలెక్టర్ ఎంతో ముందుంటారని అభినందించారు. నగరంలో కుక్కల జనాభాను నియంత్రించడం ద్వారా మనుషులకు మేలు జరుగుతుందన్నారు. జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ ప్రభాకర్, చిత్తూరు నగర కమిషనర్ పి.నరసింహ ప్రసాద్, మాజీఎమ్మెల్సీ బీఎన్.రాజసింహులు, ఎంహెచ్వో డాక్టర్ లోకేష్, ఎంఈ వెంకట రామిరెడ్డి, ఏడీ డాక్టర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

రూ.6.12 కోట్లతో అభివృద్ధి పనులు



ప్రజాశక్తి- గుడిపాల: గుడిపాల మండలంలో రూ.6.12 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టి పూర్తి చేశామని కలెక్టర్ సుమిత్ కుమార్, ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ తెలిపారు. గురువారం గుడిపాల మండలం బొమ్మసముద్రం గ్రామంలో రూ.50లక్షలతో నిర్మించిన బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్ భవనాన్ని, రూ.10లక్షల విలువైన రెండు సిమెంట్ రోడ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేస్తున్న నిధులను సద్వినియోగం చేసుకొని గ్రామాల్లో అభివృద్ధి పనులు వేగంగా చేపట్టాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ మాట్లాడుతూ... గుడిపాల మండలంలోని అన్ని గ్రామాలను సమగ్రంగా అభివృద్ధి చేస్తానని, ఇది కేవలం ఆరంభం మాత్రమేనని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో పల్లెల్లో మౌలిక సదుపాయాల కల్పన, మెరుగైన విద్యావ్యవస్థను తీసుకొస్తున్నామన్నారు. గడిచిన ఎనిమిది నెలల్లో గుడిపాల మండలంలో ఇప్పటివరకు 29 సిసి రోడ్లు, ఏడు సచివాలయం, రైతు భరోసా కేంద్ర భవనాలు, రెండు ప్రహరీలు పూర్తి చేసి ప్రారంభించామన్నారు. ఈకార్యక్రమంలో భాగంగా కొత్తూరు, గొల్లమడుగు, పానాటూరు, వసంతాపురం, చీలాపల్లి, పేయనపల్లి, బసవపల్లి గ్రామంలో సిమెంట్ రోడ్లు, చీలాపల్లి, బసవపల్లిలో రైతు భరోసా కేంద్రాలు, శ్రీరంగంపల్లిలో ప్రహరీ, చీలాపల్లిలో గ్రామ సచివాలయ భవనాలను ప్రారంభించారు. మేయర్ అముద, డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్ రెడ్డి, జీజేయం చారిటబుల్ ఫౌండేషన్ డైరెక్టర్ గురజాల చెన్నకేశవులు, ఎంపీడీవో శివరాజ్, తహశీల్దార్ జయంతి, డీఈలు నవీన్, ప్రసాద్ నాయుడు, టీడీపీ నాయకులు హరి నాయుడు, పీటర్, ఎంపిటిసిలు హరిప్రసాద్ పాల్గొన్నారు.

మున్సిపాలిటీకి రూ.62.56 లక్షల ఆదాయం



వేలంపాట నిర్వహిస్తున్న మున్సిపాలిటీ అధికారులు

ప్రజాశక్తి- విజయపురం (నగరి): గుత్త హక్కులు, వసూలు చేసుకునే హక్కును వేలం ద్వారా కేటాయించడం ద్వారా మున్సిపాలిటీకి రూ.62.56 లక్షల ఆదాయం చేకూరింది. 2025-26 ఆర్థిక సంవత్సరంకు సంబంధించి ఈ ఏడాది ఏప్రిల్ 1వ తేదీ నుంచి 2026 మార్చి 31వ తేదీ వరకు మున్సిపల్ వనరులైన వారపుసంత, దినసరి కూరగాయల మార్కెట్, బస్టాండు, టాక్సీ ఆటో స్టాండు, జంతు వధశాల గుత్తహక్కులు కేటాయించడానికి గురువారం బహిరంగ వేలంపాట నిర్వహించారు. మున్సిపల్ కౌన్సిల్ హాలులో నిర్వహించిన ఈ వేలంపాటకు పలువురు హాజరయ్యారు. అధికారుల పర్యవేక్షణలో వరుస క్రమేణా ఆస్తుల వేలంపాట నిర్వహించారు. హెచ్చుపాటదారునికి అధికారులు ఏడాది పాటు గుత్తహక్కులు వసూలు చేసుకునే హక్కును కల్పించారు. వారపు సంత హక్కులు ఎం.హరిబాబు రూ.20.65 లక్షలకు, దినసరి మార్కెట్ సీఎం భాస్కర్ రూ.19.22 లక్షలు, బస్టాండు ఎస్.సుబ్రమణ్యం రూ.10.15లక్షలకు, ఆటోస్టాండు ఎం.యోవాన్ రూ.12.19లక్షలకు, జంతువధశాల ఎం.సలీం రూ.45వేలకు హెచ్చుపాటతో స్వాధీనం చేసుకున్నట్లు మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి తెలిపారు. గత ఏడాది కన్నా ఈ ఏడాది రూ.25 వేలు అదనపు ఆదాయం వచ్చిందన్నారు.

బాల్యవివాహాన్ని అడ్డుకున్న అధికారులు



బాలిక తల్లిదండ్రులతో మాట్లాడుతున్న తహశీల్దార్

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: బాల్యవివాహాన్ని అధికారులు అడ్డుకున్న సంఘటన గురువారం మండలంలోని మొగిలిశ్వరాలయంలో చోటుచేసుకుంది. తహశీల్దార బాబు రాజేంద్రప్రసాద్ తెలిపిన సమాచారం మేరకు గురువారం తెల్లవారుజామున పలమనేరు మండలం టి.వడ్డురు గ్రామానికి చెందిన సుబ్రహ్మణ్యం కుమార్తె భార్గవి (16) అనే అమ్మాయిని బంగారుపాళ్యం మండలం సెట్టేరి గ్రామానికి చెందిన గణేష్ కుమారుడు కిరణ్ (26)కి ఇచ్చి ఇరువురి కుటుంబాల సమ్మతితో బంగారుపాళ్యం మండలం మొగిలిలోని మొగిలీశ్వర ఆలయంలో పెళ్లి చేయాలని నిశ్చయించుకున్నారు. బాల్యవివాహంకు సంబంధించి పలమనేరు ఐసిడిసి సూపర్వైజర్ ద్రాక్షయనికి సమాచారం రాగా, సీఐ శ్రీనివాసులకు సమాచారం అందించారు. దీంతో ఐసిడిఎస్ సిబ్బంది, పోలీసులు గుడి వద్ద పెళ్లిని ఆపి, ఇరు కుటుంబ సభ్యులను పోలీసుస్టేషన్‌కు తరలించి విచారించారు. అనతరం తహశీల్దార్ బాబు రాజేంద్ర ప్రసాద్ ఇరు కుటుంబాలకు కౌన్సిలింగ్ ఇచ్చి మైనార్టీ తీరే వరకు వివాహం చేయమని రాతపూర్వకంగా రాయించుకుని పంపడం జరిగిందన్నారు. కార్యక్రమంలో సిడిపిఓ వాణిశ్రీదేవి, సూపర్వైజర్లు జయశ్రీ పాల్గొన్నారు.

ఏపీఎన్జీవో సంఘంపై

సూర్యనారాయణ ఆరోపణ అవాస్తవం

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఈనెల 19వ తేదీన చిత్తూరు పర్యటనకు వచ్చిన ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేఆర్ సూర్యనారాయణ ఏపీ ఎన్జీవో సంఘంపై చేసిన అనుచిత వాక్యాలను తీవ్రంగా ఖండిస్తున్నామని ఏఎ ఎన్జీవో చిత్తూరు జిల్లా అధ్యక్షులు కేవీ రాఘవులు తెలిపారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఏపీ ఎన్జీవో సంఘంపై సామాజిక ముద్ర వేస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి లేదా ప్రభుత్వం ఏదైతే ఉంటే ఆ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తిని సంఘం ప్రతినిధిగా పెట్టుకుంటామని ఆరోపించడానికి తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఇలాంటి అనేక వ్యాఖ్యలు చేయడం సూర్యనారాయణ వ్యక్తిత్వానికి వదిలేస్తున్నామన్నారు. ముందుగా ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శిగా ఉన్న ఆస్కార్‌రావు సూర్యనారాయణపై చేసిన ఆరోపణలకు సమాధానం చెప్పాలన్నారు. ఎలాంటి ఉద్యమానికి నాయకత్వం వహించని నాయకుడు ఉద్యోగుల సంక్షేమానికి ఏమేమి పాటుపడ్డారో తెలపాలన్నారు. సూర్యనారాయణ రావు తనవైఖరి ఇలాగే కొనసాగిస్తే ఉద్యోగుల తగిన రీతిన బుద్ధి చెప్తారన్నారు. ఈ విలేకరుల సమావేశంలో కార్యదర్శి వీజీ రఘు, కార్యనిర్వాహక కార్యదర్శి ఎస్‌జె.ప్రదీప్, ట్రెజరర్ మురళి, ఉపాధ్యక్షులు బాలసుబ్రమణ్యం, పురుషోత్తం రెడ్డి, జాయింట్ సెక్రటరీ రమేష్, సురేష్, ముఖ్యకార్యదర్శి ప్రసాద్ పాల్గొన్నారు.

రాష్ట్ర మాల వెల్ఫేర్ కో-ఆపరేటివ్ ఫైనాన్స్

కార్పొరేషన్ ఛైర్మన్ నేడు జిల్లాకు రాక

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాలవెల్ఫేర్ కో-ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ డాక్టర్ పెదపూడి విజయ కుమార్ ఈ నెల 21వ తేదీ చిత్తూరు జిల్లాలో పర్యటించనున్నారని జిల్లా షెడ్యూల్డ్ కులాల సేవాసహకార సంఘం లిమిటెడ్ కార్య నిర్వహణాధికారి యు.చెన్నయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా 21వ తేదీ శుక్రవారం ఉదయం 10 గంటలకు వివిధ సంఘాల నాయకులతో చిత్తూరు టిటిడిసి జిల్లా సమాఖ్య డెయిరీ వద్ద సమావేశం కానున్నారని కావున జిల్లా షెడ్యూల్డ్ కులాల సేవా సహకారం సంఘంకు సంబంధించిన లబ్ధిదారులు, సంఘ నాయకులు, ప్రజలు సమావేశానికి హాజరు కావాలని కోరారు.

తాగునీటి బోరు మంజూరు

ప్రజాశక్తి - గంగవరం: మండలంలోని కీలపట్ల గ్రామపంచాయతీలో తాగునీటి సమస్య ఉందని గ్రామస్తులు ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే గ్రామానికి తాగునీటి బోరు మంజూరు చేసి పనులు చేయించడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. అలాగే జరవారిపల్లిలోనూ రెండు తాగునీటి బోర్లు ఎమ్మెల్యే వారోతో వేయించడం వలన ప్రజలు తాగునీటి సమస్యతో ఇబ్బంది లేకుండా ఉన్నారని తెలిపారు.

ట్రాఫిక్ మళ్లింపు: సిఐ

ప్రజాశక్తి - వీ కోట: మండల కేంద్రమైన వీ కోటలో వెలసిన శ్రీ వేణుగోపాలస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు భాగంగా శుక్రవారం నిర్వహించే శ్రీ వీరాంజనేయ స్వామి వారి పుష్పపల్లకి సేవను విజయవంతం చేయాలని సిఐ సోమశేఖర్ రెడ్డి తెలిపారు. పుష్ప పల్లకి సందర్భంగా వీ కోటలో ట్రాఫిక్ ఆంక్షలు విధించడం జరిగిందని, అదుగుడానా సీసీ కెమెరా నిఘా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. జిల్లా ఎస్పీ, డీఎస్పీల సూచన మేరకు శుక్రవారం సాయంత్రం 6 నుంచి శనివారం 6 గంటల వరకు కుప్పం వైపు నుంచి వచ్చే వాహనాలు వైఎస్ఆర్ సర్కిల్ నుంచి పట్రపల్లి వైపుగా వెళ్లి కొత్త హైవే మీదుగా ప్రయాణించి కస్తూరినగరం చేరుకోవాలన్నారు. అలాగే పలమనేరు వైపు నుంచి వచ్చే వాహనాలు అంబేద్కర్ సర్కిల్ నుంచి బైరపల్లి క్రాస్ మీదుగా పాతూరు, అన్నవరం క్రాస్ వైపు వెళ్ళాల్సి ఉంటుందన్నారు. ఈ ట్రాఫిక్ మళ్లింపును ప్రజలు గమనించి పోలీసు వారికి సహకరించాలని సిఐ విజ్ఞప్తి చేశారు.

విద్యుత్ స్తంభాలను ఢీకొన్న టెంపో

కరెంట్ లేక ఇబ్బందిపడిన ప్రజలు



ప్రమాదంలో విరిగిన విద్యుత్ స్తంభం

ప్రజాశక్తి - వీ కోట: మండల కేంద్రమైన వీకోటలో రెండు వేరువేరు ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలను బుధవారం రాత్రి టెంపోలు ఢీకొన్న సంఘటనలో పట్టణంలో అర్ధరాత్రి నుండి విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. బాలికల వసతి గృహం పక్కన విద్యుత్ స్తంభాన్ని అర్ధరాత్రి ఓ టెంపో ఢీకొనడంతో విద్యుత్ స్తంభం విరిగిపోవడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. డ్రైవర్ అతివేగంగా వెళ్తూ విద్యుత్ స్తంభాన్ని ఢీకొనడంతో ఆ తీవ్రతకు స్తంభం విరిగి శాంతిపురం నుంచి సబ్‌స్టేషన్‌కు సరఫరా వచ్చే లైన్ తెగిపోయింది. దీంతో అర్ధరాత్రి నుంచి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఉదయాన్నే అక్కడికి చేరుకున్న ట్రాన్స్‌కో సిబ్బంది స్తంభాన్ని మార్చి సరఫరా పునరుద్ధరణ చర్యలు చేపట్టారు. అదేవిధంగా కుప్పం రోడ్డులో టీవీఎస్ షోరూం ఎదురుగా మరో విద్యుత్ స్తంభాన్ని కూడా టెంపో ఢీకొనడంతో విద్యుత్ వైర్లు పూర్తిగా తెగిపోయాయి. పట్టణానికి సరఫరా జరిగే ఎల్‌టీ లైన్ సైతం తెగి వైర్లు రోడ్డుపై పడ్డాయి. ఈ సంఘటనలతో పట్టణంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

చిరుధాన్యాల సాగుపై రైతులకు శిక్షణ



అవగాహన కల్పిస్తున్న మండల వ్యవసాయ అధికారి నాగరాజు

ప్రజాశక్తి- గుడిపల్లి: జాతీయ ఆహార భద్రతా పథకం, ఆహారం, పోషకాహార భద్రత ద్వారా అమలు అవుతున్న చిరుధాన్యాలు, పప్పుధాన్యాలు సాగును ప్రోత్సహించే పథకాలలో భాగంగా గుడిపల్లి మండలం సంగనపల్లి, చీకటి పల్లి గ్రామాలలో చిరుధాన్యాల పంటల సాగు – యాజమాన్య పద్ధతులపై రైతులకి శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ శిక్షణా కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి నాగరాజు మాట్లాడుతూ చిరుధాన్యాలైన రాగి, సామ, కొర్ర, వరిగలు, అరికలు పంటల ప్రాముఖ్యత వివరించారు. అలాగే చిరుధాన్యల పంటలలో అధిక దిగుబడులు పొందడానికి పాటించవలసిన నూతన సాంకేతిక పద్ధతులు, సమగ్ర పోషక యాజమాన్యం, సమగ్ర నీటి యాజమాన్యం, సమగ్ర కలుపు యాజమాన్యం, సమగ్ర పురుగుల యాజమాన్యం, ఆయా పంటలలో ఉండే నూతన వంగడాల గురించి, పంట వేసినప్పటి నుంచి పంట కోత వరకు పాటించవలసిన పద్ధతుల గురించి వివరించారు. పంట కోత తర్వాత కూడా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రాసెసింగ్ చేయడం ద్వారా ఈ చిరుధాన్యాల నుండి ఉప ఉత్పత్తులు తయారుచేసి అధిక ఆదాయం పొందవచ్చని, వాటిని ఉపయోగించడం ద్వారా కలిగే ఆరోగ్య ప్రయోజనాలు గురించి వివరించారు. అలాగే ఈ చిరుధాన్యాలు అన్ని రకాల నేలలలో కూడా తక్కువ నీరు, తక్కువ పెట్టుబడితో సాగు చేయవచ్చు అని, నాణ్యమైన పంట దిగుబడిన పొందవచ్చు అని తెలిపారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా ఈ పంటలు పండించడం ద్వారా రసాయనాలు వాడకుండా ఉండటం వల్ల నేల ఆరోగ్యాన్ని మన ఆరోగ్యాన్ని, వాతావరణ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని తెలిపారు.

హెల్మెట్ ధరించకుంటే కఠినచర్యలు: ఎస్సై



వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్ఐ పరశురాముడు

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: మండల కేంద్రంలో గురువారం ఎస్సై పరశు రాముడు సిబ్బంతో కలిసి వాహనాలను తనిఖీ చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బైరెడ్డిపల్లి టు పలమనేరు జాతీయ రహదారిలో నెల్లిపట్ల మలుపు వద్ద వాహనాల తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మద్యం తాగి వాహనం నడిపి పలువురికి జరిమానా విధించారు. అలాగే హెల్మెట్ ధరించిన పలువురు ద్విచక్రవాహనదారులకు హెల్మెట్ లేకుండా కఠిన చర్యలు తీసుకుంటామని, రోడ్డు భద్రతా నిబంధనలు కచ్చితంగా పాటించాలిని హెచ్చరించారు. ఎస్సైతోపాటు ఏఎస్ఐ, సిబ్బంది పాల్గొన్నారు.

విలేకర్లకు రక్షణ కల్పించాలి

ఆర్‌డివోకు జర్నలిస్టుల వినతి



టవర్ క్లాక్ వద్ద నిరసన తెలుపుత్తున్న విలేకర్లు

ప్రజాశక్తి- పలమనేరు: పార్వతీపురం, మన్యం జిల్లా మక్కువ ప్రజాశక్తి విలేకరి మల్యాడ రామారావుపై టిడిపి నాయకులు వేణుగోపాల్ నాయుడు దాడి చేయడాన్ని నిరశిస్తూ గురువారం పలమనేరు నియోజకవర్గంలోని మీడియా మిత్రులందరూ టవర్ క్లాక్ వద్ద రహదారిపై నిరసన తెలిపారు. అనంతరం విలేకర్లకు రక్షణ కల్పించాలని కోరుతూ ఆర్‌డిఓ భవానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు విలేకర్లు మాట్లాడుతూ నేడు విలేకర్లకు రాజకీయల నాయకుల నుంచి ప్రమాదం పొంచి ఉందని, జర్నలిస్టులకు రక్షణ కల్పించేలా చట్టాలను తీసుకురావాలని కోరారు. అలాగే విలేకరిపై దాడి చేసిన నాయకుడిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రజాశక్తి విలేకరి డి.త్యాగరాజులు, మానవ హక్కుల సంఘం అధ్యక్షులు డివి.మునిరత్నం, సీనియర్ జర్నలిస్ట్ టీ.మునిరత్నం, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ మద్యం అమ్మకాలపై ఉక్కుపాదం

ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ విజయశేఖర్



ప్రజాశక్తి - కార్వేటినగరం: అక్రమ మద్యం అమ్మకాలపై ఉక్కుపాదం మోపడానికి ఎక్సైజ్‌శాఖ ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తుందని ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ విజయశేఖర్ అన్నారు. గురువారం కార్వేటినగరం ఎక్సైజ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డిప్యూటీ కమిషనర్ మాట్లాడారు. గ్రామాల్లో సారా అమ్మకాలు, తయారీ, బెల్టు షాపులు వంటి అక్రమ వ్యాపారాలపై ప్రత్యేక నిఘా ఉంచి వాటిని అణచివేత దిశగా పావులు కదిపేందుకు కొత్త ప్రణాళిక రూపొందిస్తున్నామని పేర్కొన్నారు. గతంలో ఎక్సైజ్ పోలీస్ శాఖ మాత్రమే సారా వ్యాపారాలపై దాడులు నిర్వహించేవారమని, ఇప్పుడు ఎక్సైజ్, పోలీసు శాఖలతో పాటు అటవీశాఖ, పంచాయతీరాజ్ శాఖ కూడా అక్రమ వ్యాపారాలపై నిఘా ఉంచనుందని తెలిపారు. అటవీ ప్రాంతాల్లో సారా తయారీ చేసిన అటవీశాఖ వారు కేసులు నమోదు చేయడం జరుగుతుందని, గ్రామాల్లో కమిటీలు ఏర్పాటు చేసి ఎక్కడ సారా తయారు చేసినా తెలుస్తోందని అక్రమార్కులు కలుగులో ఉన్న పట్టుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. తప్పు చేసిన వారు మహిళలైన, పురుషులైనా అరెస్టు చేయడానికి కోర్టు ఆదేశాలిచ్చాయని చెప్పారు. సారా తయారీపై ఆధారపడి జీవిస్తున్న వారికి ప్రభుత్వం జీవనోపాధి కల్పించడానికి వారి కార్పొరేషన్ల ద్వారా రుణాలు మంజూరు చేయడమే కాకుండా డ్రైవింగ్ ఆసక్తి కలిగిన వారికి ఆటోలు, సెక్యూరిటీ గార్డులు వంటి పనులు ఇప్పించి వారి జీవితంలో మార్పు తీసుకొచ్చేందుకు కృషి చేయడం జరుగుతుందన్నారు. గ్రామాల్లో సారా అమ్మకాలు, తయారీ వంటి అక్రమార్జనకు పాల్పడుతున్నట్లు తెలిసిన వెంటనే 14405 నంబరకు సమాచారం అందించాలని సమాచారం అందించిన వారు వివరాలను గోప్యంగా ఉంచడమే కాకుండా వారికి రివార్డు ప్రకటిస్తామని తెలిపారు. కార్వేటినగరం ఎక్సైజ్ పరిధిలో అత్యధికంగా సారా తయారీలో పాలసముద్రం మండలంలోని నరసింగా పురం నెంబర్ 1లో ఉందని, నెంబర్ 2గా వెదురు కుప్పం మండలం నక్కలాంపల్లి, యన మలమంద శ్రీరంగరాజపురం మండలంలో చిన్నతయ్యూరు, చిల్లమాకలపల్లి ఉందని ఈ గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించి సారా రహిత గ్రామాలుగా చేయడానికి ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు పేర్కొన్నారు. విలేకరుల సమావేశంలో సిఐ శిరిషాదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

పబ్లిక్ పరీక్షా కేంద్రాలలో కట్టు దిట్టమైన ఏర్పాట్లు



వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్, ఎస్పీ

ప్రజాశక్తి - చిత్తూరు అర్బన్: ఇంటర్మీడియట్, పదవ తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణ పరీక్షా కేంద్రాలలో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయడం జరుగుతున్నదని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. గురువారం రాష్ట్ర సచివాలయం నుండి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ అన్ని జిల్లాల కలెక్టర్లు ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఇంటర్మీడియట్, పదవ తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణపై సమీక్షించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ మార్చి, ఏప్రిల్ నెలలు పరీక్షల మాసాలని ఆయా పరీక్షలు సజావుగా సాగేందుకు తగిన విస్తృత ఏర్పాటు చేయాలని కలెక్టర్లు, ఎస్పీలను ఆదేశించారు. పరీక్షా కేంద్రాలలో తాగునీరు, ప్రథమ చికిత్స, ఏర్పాట్లు విద్యుత్తు, బెంచులు వంటి కనీస సౌకర్యాలు అందు బాటులో ఉండే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్లకు సూచించారు. పరీక్షా కేంద్రాలకు 100 మీటర్ల పరిధిలో 144 సెక్షన్ కింద నిషేధాజ్ఞలు జారీ చేయాలని ఆదేశించారు. విద్యాశాఖ కార్యదర్శి కే శశిధర్ మాట్లాడుతూ ఇంటర్మీడియట్, ఏపీ ఓపెన్ స్కూల్ ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణకు విస్తృత ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పరీక్షల నిర్వహణలో ఫిర్యాదుల స్వీకరణకు రాష్ట్రస్థాయిలో టోల్ ఫ్రీ నెంబర్ 1800 425 1531 కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వయోజన విద్యాశాఖ డైరెక్టర్ కృత్తికా శుక్ల మాట్లాడుతూ పరీక్ష కేంద్రాల్లోకి మొబైల్ ఫోన్లు ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులు అనుమతించరాదని స్పష్టం చేశారు. జిల్లాలో ఇంటర్మీడియట్ పబ్లిక్ థియరీ పరీక్షలకు మొత్తం 30,652 మంది విద్యార్థులు 50 పరీక్షా కేంద్రాలలో హాజరుకానున్నట్లు, పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు సంబంధించి 21,248 మంది విద్యార్థులు 118 కేంద్రాలలో హాజరుకానున్నట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాలలో అవసరమైన అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేసేందుకు సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించడం జరిగిందని కలెక్టర్ ప్రధాన కార్యదర్శికి వివరించారు.

బాల కార్మికుల నిర్మూలనకు సహకరించండి

ప్రజాశక్తి - చిత్తూరు డెస్క్: బాల కార్మికులు లేని సమాజం కొరకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని లేబర్ ఆఫీసర్ కె.ఆర్ ఆనంద బాబు అన్నారు. గురువారం సదుంలో చిత్తూరు జిల్లా కలెక్టర్ ఆదేశాలు మేరకు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఏపి సి.ఐ.డి, కార్మిక శాఖా, జిల్లా టాస్క్ పోర్స్ కమిటీ, పోలీస్, విద్యా శాఖా సి ఆర్ పి ఉపాధ్యాయులు, వైద్య, శిశు సంక్షేమ శాఖ, చైల్డ్ హెల్ప్ లైన్ 1098, గ్రేట్ విజన్ సొసైటీ– జి వి ఎస్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో పాన్ ఇండియా రెస్క్యూ, రేహాబిలిటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బాల కార్మికుల నిర్మూలన చట్టం, 1986 సవరించిన చట్టం 2016 గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. బాల కార్మికులను ఎవరైనా పనిలోకి పెట్టుకున్నట్లయితే, యజమానులకు జైలు శిక్ష జరిమానా వేయబడుతుందని పీలేరు కార్మిక శాఖ, లేబర్ ఆఫీసర్ కె. ఆర్ ఆనందబాబు, గ్రేట్ విజన్ సొసైటీ అధ్యక్షులు డాక్టర్ జి. వి. ఎస్ బాబు ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాల మంద సిఆర్పి విశ్వనాథ, శిశు సంక్షేమ శాఖ, వైద్య, గ్రేట్ విజన్ సొసైటీ – జివిఎస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

జ్ఞానజ్యోతి శిక్షణా తరగతులను పరిశీలించిన ఎంఈఓ



శిక్షణ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ

ప్రజాశక్తి - సోమల: మండల కేంద్రమైన సోమల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సర్వ శిక్ష అభియాన్, ఐసిడిఎస్ ఆధ్వర్యంలో అంగన్వాడీ కార్యకర్తలకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాన్ని మండల విద్యాశాఖ అధికారి కేశవరెడ్డి గురువారం పరిశీలించారు. ప్రభుత్వం ఎంతో సదుద్దేశంతో అంగన్వాడీ కార్యకర్తలకు పలు అంశాలపై శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తోందని, వీటిని కార్యకర్తలు సద్వినియోగం చేసుకొని శిక్షణలో తెలిపే విషయాలను అవగాహన చేసుకుని ఆచరణలో పెట్టాలని కోరారు. ఫ్రీ స్కూల్ నందు విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచి వారికి కృత్యాలను నేర్పించాలని కోరారు. అనంతరం ఆటపాటలతో అంగన్వాడీ కార్యకర్తలకు శిక్షణ ఇస్తున్న విధానాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో సూపర్వైజర్ హరిత, రిసోర్స్ పర్సన్ లు పాల్గొన్నారు.

మౌజాన్లకు ఆర్థిక సహాయంపై హర్షం



హర్షం వ్యక్తం చేస్తున్న ముస్లింలు

ప్రజాశక్తి - బంగారుపాళ్యం : మౌజాన్లకు, హిమములకు ఆర్థిక సహాయం అందించడంపై మండల మైనార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేసినట్టు మైనార్టీ నాయకులు రహమతుల్లా ఖాన్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైనార్టీల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, దీంతో మసీదుల మౌజాన్లకు హిమాములకు నెలవారి జీతాలను అందివ్వడం శుభ పరిమాణమన్నారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ నాయకులు నాసిర్ ఖాన్ జాకీర్ హుస్సేన్, ఫైరోజ్ ఖాన్, సర్దార్ చాన్ బాషా, లోకనాథం నాయుడు, రాధాకృష్ణ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి- విజయపురం (నగరి) : మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం ఎంపీపీ భార్గవి అధ్యక్షతన ఈ నెల 22వ తేదీన నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఎన్.కృష్ణయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 20 విభాగాలకు సంబంధిత సమీక్ష నిర్వహించడం జరుగుతుందన్నారు. మండలస్థాయి అధికారులు, ఎంపీటీసీలు, కోఆప్షన్ సభ్యులు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు తప్పక హాజరుకావాలన్నారు.

కార్పొరేషన్ సబ్సిడీ లోన్లకు ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం: ఎస్ఆర్ పురం మండలంలో సబ్సిడి బ్యాంకు లోన్లకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు 24వ తేదీన ఇంటర్వ్యూలు జరుగుతాయని ఎస్ఆర్ పురం ఎంపీడీవో మోహన మురళి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దరఖాస్తు చేసుకున్న వారు ఉదయం 10 గంటలకు ఇంటర్వ్యూకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలన్నారు.


సీసీ కెమెరాల ఏర్పాటుపై అవగాహన



సిసి కెమెరాలపై అవగాహన కల్పిస్తున్న డిఎస్పీ సయ్యద్ మహ్మద్ అజిత్

ప్రజాశక్తి - విజయపురం (నగరి): మండలంలోని గ్రామాలలో స్థానిక డి.ఎస్.పి సయ్యద్ మహ్మద్ అజిత్ గురువారం సీసీ కెమెరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో సీసీ కెమెరాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. టెక్నాలజీ ద్వారా ప్రజలకు మరింత దగ్గర సేవలు చేయడానికి సీసీ కెమెరాలు ఉపకరిస్తాయని తెలిపారు. సీసీ కెమెరాలు ఫుటేజ్‌లతో కోర్టులో నిందితులకు తప్పకుండా శిక్ష పడుతుందని తెలిపారు. ఒక్క సీసీ కెమెరా 100 మంది కానిస్టేబుల్ తో సమానమని, 24 గంటలు 365 రోజులు నిర్విరామంగా నిరంతరాయంగా సీసీ కెమెరాలు పనిచేస్తాయని తెలిపారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నగిరి సీఐ, మహేశ్వర్, నింద్ర సీఐ భాస్కర్, విజయపురం ఎస్ఐ బలరాం, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.


కలెక్టర్‌కు ఇచ్చిన అర్జీలు ఎన్ని పరిష్కరించారు ?



రెవెన్యూ కార్యాలయంలో రికార్డుల పరిశీలిస్తున్న ఆర్డీవో శ్రీనివాసులు

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: గంగాధరనెల్లూరు మండలంలో, రెవెన్యూపరమైన సమస్యల గురించి ప్రతి సోమవారం జిల్లా కలెక్టర్‌కు ఇచ్చిన అర్జీలపై ఇప్పటివరకు ఎన్ని పరిష్కరించారో తెలుపాలని చిత్తూరు ఆర్డీవో శ్రీనివాసులు అధికారులను ప్రశ్నించారు. గురువారం తాసిల్దార్ కార్యాలయంను ఆయన తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసిల్దార్ తులసీరామ్, పెద్దకాలువ విఆర్వో ద్రాక్షాయణి పాల్గొన్నారు.

ముగ్గిసిన బీసీ కార్పొరేషన్ సబ్సిడి రుణాల ముఖాముఖి



ముఖిముఖి కార్యక్రమంలో అధికారులు

ప్రజాశక్తి - సోమల: మండల కేంద్రమైన సోమల ఎంపీడీవో కార్యాలయ సమీపంలోని సమావేశపు మందిరంలో గురువారం బీసీ కార్పొరేషన్ సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు ముఖాముఖి కార్యక్రమం నిర్వహించగా 331 మంది హాజరయ్యారని ఎంపీడీవో నారాయణ గురువారం తెలిపారు. ధ్రువపత్రాల పరిశీలన చేశామని, బ్యాంకు వారు క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం అర్హులైన వారికి రాయితీ రుణాలు మంజూరు చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శిలు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గుడిపాల మండలంలో రూ.6.12 కోట్లతో అభివృద్ధి పనులు

ప్రజాశక్తి - చిత్తూరు అర్బన్ : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి ఎనిమిది నెలల్లోనే గుడిపాల మండలంలో రూ.6.12 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టి పూర్తి చేశామని ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ చెప్పారు. గురువారం జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్‌తో కలిసి గుడిపాల మండలం, బొమ్మసముద్రం గ్రామంలో రూ.50 లక్షలతో నిర్మించిన బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్ భవనాన్ని, రూ.10 లక్షల విలువైన రెండు సిమెంట్ రోడ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేస్తున్న నిధులను సద్వినియోగం చేసుకొని గ్రామాల్లో అభివృద్ధి పనులు వేగంగా చేపట్టాలని సూచించారు. ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ మాట్లాడుతూ గుడిపాల మండలంలోని అన్ని గ్రామాలను సమగ్రంగా అభివృద్ధి చేస్తానని, ఇది కేవలం ఆరంభం మాత్రమేనన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం: ఆర్టీసీ బస్సు ఢీకొని ద్విచక్ర వాహనదారుడు అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన ఎస్ఆర్ పురం మండలంలోని కొత్తపల్లి గ్రామపంచాయతీ 49. కొత్తపల్లి మిట్ట చిత్తూరు పుత్తూరు జాతీయ రహదారి సిఎస్ఐ చర్చి దగ్గర మృతి చెందిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది స్థానికుల కథనం మేరకు... తిరుపతి దేవళం పేట బస్సు చిత్తూరు వైపు వెళ్తుండగా ద్విచక్ర వాహనదారుడు చిత్తూరు నుండి కొత్తపల్లి మెట్ట వైపు గురువారం రాత్రి వస్తుండగా బస్సు ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు ఎస్ఆర్ పురం మండలం కటిక పల్లి మండలం కటిక పల్లి గ్రామానికి చెందిన కుప్పయ్య నాయుడు కుమారుడు తిరుమలేష్ (42) గా స్థానికులు గుర్తించారు. సమాచారం తెలుసుకున్న ఎస్ఆర్ పురం పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం.. కేసు నమోదు



ప్రజాశక్తి - కార్వేటినగరం: బెల్టు షాపులపై దాడులు నిర్వహించి 107 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని ముగ్గురుపై కేసునమోదు చేసినట్లు ఎస్.ఐ రాజ్‌కుమార్ తెలిపారు. గురువారం రాత్రి తమ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్.ఐ రాజ్కుమార్ మాట్లాడుతూ జిల్లా ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు బెల్టుషాపుల దాడులు నిర్వహించడం జరిగిందన్నారు. ఈ దాడుల్లో భాగంగా కేఎం పురం గ్రామం నిర్వహిస్తున్న బెల్టుషాపుపై దాడులు చేపట్టామని, అలాగే కొల్లాగుంట క్రాస్ రోడ్డులో నిర్వహిస్తున్న బెల్టుషాపులపై ప్రత్యేక దాడులు నిర్వహించి 98 క్వార్టర్ బాటిళ్లు, 9 బీరుబాటిళ్లను స్వాధీనం చేసుకుని ముగ్గురుపై కేసునమోదు చేసినట్లు పేర్కొన్నారు. గ్రామాల్లో ఎక్కడైనా అక్రమ మద్యం అమ్మకాలు జరుపుతున్నట్లు తెలిసిన వెంటనే పోలీసులకు సమాచారం అందించి సహకరించాలని తెలిపారు. ఈ దాడుల్లో ఏఎస్.ఐ మునికృష్ణ, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

లోకేష్‌ను కలిసిన హమీద్ బాషా



ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : తిరుపతి జిల్లా పర్యటనలో నియోజక వర్గ కార్యకర్తల సమావేశానికి ముఖ్య అతిధిగా విచ్చేసిన మంత్రి నారా లోకేష్‌ను నగరి నియోజక వర్గం తెలుగు యువత ఆర్గనైజింగ్ సెక్రటరీ హమీద్ బాషా మర్యాద పూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా ఇమామ్, మౌజన్‌లకు గౌరవవేతనం విడుదల చేసిందుకు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

కిరణ్ కుమార్ డాక్టరేట్



ప్రజాశక్తి - క్యాంపస్ : ఎస్వీ యూనివర్సిటీ ఆక్వా కల్చర్ విభాగ పరిశోధక విద్యార్థి బి.కిరణ్ కుమార్‌కు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు సిఇ ధామ్లు నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆక్వా కల్చర్ విభాగాధిపతి, బిఓఎస్ చైర్పర్సన్, మహిళ హాస్టల్ వార్డెన్ ఆచార్య పి.నాగజ్యోతి మార్గదర్శకత్వంలో "కంపేరేటివ్ స్టడీస్ ఆఫ్ ది ఎఫెక్ట్ ఆఫ్ ప్రోబయాటిక్స్ ఆన్ ద గ్రోత్ అండ్ వాటర్ క్వాలిటీ మెయింటెనెన్స్ ఆఫ్ ఫ్రెష్ వాటర్ ఫిషెస్ పంగాసిఎస్ హైపోథలమస్ అండ్ పియరక్టస్ బ్రోకైపోమస్ (మంచినీటి చేపల పెరుగుదలపై పరిశోధన గ్రంధాన్ని వర్సిటీకి సమర్పించినట్లు వివరించారు.

క్రైం న్యూస్

గుర్తు తెలియని వాహనం ఢీ.. వ్యక్తికి గాయాలు



గాయాలపాలైన సౌందర్యరాజ్

ప్రజాశక్తి - కార్వేటినగరం: గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలైన ఘటన గురువారం మండల పరిధిలోని అమ్మపల్లి క్రాస్ రోడ్డు వద్ద చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు గంగాధరనెల్లూరు మండలం, కొండేపల్లి గ్రామానికి చెందిన సౌందర్యరాజ్ ద్విచక్రవాహనంలో సొంతపనుల నిమిత్తం వెళ్లుతున్న తరుణంలో కార్వేటినగరం మండలం అమ్మపల్లి క్రాస్ మలువు వద్ద వెనుకపై నుంచి వచ్చిన గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అతని తలపై తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు గుర్తించి కార్వేటినగరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, పోలీసులకు సమాచారం అందించారు. తలకు తీవ్రమైన గాయాలు కావడంతోపాటు, చెవులో రక్తం రావడం గుర్తించిన ప్రభుత్వ ఆస్పత్రి సిబ్బంది ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయాకు రెఫర్ చేసినట్లు తెలిపారు. పోలీసులు కేసునమోదు చేసి ధర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

నా కుమార్తెను ఇప్పించండి.. ఓ తల్లి అభ్యర్థన



నిరసన తెలుపుతున్న ఉషశ్రీ

ప్రజాశక్తి-పుంగనూరు : నా కుమార్తెను నాకు ఇప్పించండి అంటూ స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద న్యాయం చేయాలని గురువారం ఉషశ్రీ అనే మహిళ నిరసన చేసింది. ప్రజా సంఘాలు ఆమెకు మద్దతు తెలుపుతూ నిరసనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉషశ్రీ మాట్లాడుతూ నేను మదనపల్లిలో గతంలో అగ్రికల్చర్ కోర్సు చేస్తున్నానని పుంగనూరుకు చెందిన డ్రైవర్ ప్రభ తనను ప్రేమిస్తున్నానని చెప్పి పెళ్లి చేసుకున్నాడని తెలిపారు. తనకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారని తెలిపారు. ఇటీవల కాలంలో తన భర్త ప్రవర్తనలో మార్పు వచ్చిందని, మద్యం సేవించి వేధింపులు గురి చేసేవాడని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. మరో మహిళతో అక్రమ సంబంధం పెట్టుకోగా, నేను నా కుమార్తెలను తీసుకొని సొంత ఊరు నాయుడుపేటకు వెళ్లిపోయానని తెలిపారు. నా భర్త అక్కడకు వచ్చి కుమార్తెలకు మాయ మాటలు చెప్పి, సైకిల్ కొనిస్తానని చెప్పి పుంగనూరు తీసుకొని వచ్చేసాడన్నారు. అప్పటినుంచి ఇప్పటివరకు కనిపించకుండా పోయాడని తెలిపారు. ఫోన్ చేస్తే సమాధానం ఇవ్వడం లేదన్నారు. పాప ఏమైందోనని ఆందోళన వ్యక్తం చేశారు. నాకు న్యాయం జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉషశ్రీ తల్లి, ప్రజాసంఘాల నాయకులు జే నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

శ్రీగంధం చెక్కలు స్వాధీనం.. నిందితులు అరెస్టు

ప్రజాశక్తి - పుంగనూరు : కుప్పం నుండి పుంగనూరుకు శ్రీగంధం చెక్కులను అక్రమంగా తరలిస్తుండగా దాడి చేసి వారిని పట్టుకుని అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్లు సిఐ శ్రీనివాసులు గురువారం తెలిపారు. కుప్పం నుండి పుంగనూరుకు రూ 1.5లు లక్షలు విలువ చేసే 27 కేజీలు శ్రీగంధం చెక్కలు కుప్పం నుండి పుంగనూరుకు ప్రైవేటు బస్సులో అక్రమంగా తరలిస్తుండగా డాన్ బోస్కో స్కూల్ వద్ద పోలీసులు జరిపిన దాడుల్లో పట్టుకున్నట్లు తెలిపారు. మండలంలోని నల్లగుట్లపల్లి తండాకు చెందిన మూడే చిత్ర(50), మూడే రత్న (55), మూడే నకియా నాయక్ (55) కలసి అక్రమ రవాణా చేస్తుండగా పోలీసులకు పట్టుబడ్డారు.

బాలికల విద్య, ఆరోగ్యంపై అవగాహన

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: మండల వైద్యాధికారి డాక్టర్ విజయ్ కుమార్ ఆదేశాల మేరకు గురువారం కడపనత్తం హైస్కూల్‌లో హెల్త్‌ఎడ్యుకేటర్ సావిత్రి బాలికల విద్య ఆరోగ్యంపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బాల్య వివాహాల వలన కలిగే నష్టాలను, అనర్థాలను వివరించారు. అలాగే వ్యక్తిగత శుభ్రత, రక్తహీనత నివారణకు తీసుకోవల్సిన జాగ్రత్తలు తెలియజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మౌనిక, విద్యార్థులు పాల్గొన్నారు.


లక్ష్యం వైపు పయనించండి



సమావేశంలో మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపాల్

ప్రజాశక్తి- కార్వేటినగరం: విద్యార్థులు ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకుని ఆ దిశగా పయనించాలని ప్రభుత్వ డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయులురెడ్డి అన్నారు. గురువారం కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ విభాగం డిపార్ట్మెంట్ ఆఫ్ యూత్ సర్వీసెస్, సెట్విన్ తిరుపతి వారి సహకారంలో పర్సనాలిటీ డెవలప్మెంట్, స్టడీ స్కిల్స్ అలాగే కెరీర్ గైడెన్స్ అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు గమ్యం చేరేంతవరకూ తాను లక్ష్యం వైపు పయనించాలని సూచించారు. అనంతరం సెట్విన్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ అధికారి కె.మోహన్ మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు స్కిల్ డెవలప్మెంట్పై ప్రత్యేక శ్రద్ధ చూపాలని తెలియజేశారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి ధనంజయరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు నైపుణ్య సాధనకు ప్రతి నిత్యం కృషి చేయాలని, అప్పుడే ఎంచుకున్న లక్ష్యానికి చేరుకోగలమని తెలిపారు. కౌటిల్య సీనియర్ మేనేజర్ ఎన్ఎస్ రెడ్డి, అధ్యాపకులు సుబ్బారావు, జోగి ప్రసాద్, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ మృతికి ఘన నివాళి



నివాళి అర్పిస్తున్న టీడీపీ నాయకులు

ప్రజాశక్తి – రామకుప్పం: మండలంలోని, కొంగనపల్లి మాజీ సర్పంచ్ పెద్ద కృష్ణప్ప అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న టిడిపి నేతలు ఆయన భౌతిక కాయానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా టిడిపి రాష్ట్ర నేత డాక్టర్ సురేష్ బాబు, మాజీ ఎమ్మెల్సీ శ్రీనివాసులు, మనోహర్‌లు మాట్లాడుతూ పెద్ద కృష్ణప్ప మృతి తీరనిలోటన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నేతలు మునస్వామి, నారాయణ చారి, మండల అధ్యక్షుడు ఆనంద రెడ్డి, కార్యదర్శి నరసింహులు, ఆంజనేయ రెడ్డి రామ్మూర్తి, సీతాపతి, కన్నన్ ,చలపతి, నందా రెడ్డి, మనోహర్, రామకృష్ణప్ప, విజయ్ రెడ్డి, గంట్ల గౌడూ, బాలరాజు, సుబ్రి, వెంకటరమణ, గంట్ల రెడ్డి, నియాజ్ తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీ లోన్లకు ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి - తవణంపల్లి: తవణంపల్లి మండలం, ఎంపీడీవో కార్యాలయంలో బీసీ కార్పొరేషన్ లోన్లకు సంబంధించి స్వయం సహాయక రుణాలకు ఇంటర్వ్యూ గురువారం నిర్వహించారు. మండల పరిధిలో, గ్రామ పంచాయతీల వారీగా 580 మంది లబ్ధిదారులు లోన్లకు దరఖాస్తు చేసుకోగా, ఇందులో 550 మందికి ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఎంపికైన లబ్ధిదారుల జాబితాను త్వరలో తెలియపరుస్తామని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు,వెల్ఫేర్ అసిస్టెంట్లు,డిజిటల్ అసిస్టెంట్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.